80 రోజుల్లో భూప్రదిక్షణ

జూల్స్ వెర్న్



80 రోజుల్లో భూప్రదక్షిణ

జూల్స్ వెర్న్





అధ్యాయం 1
ప్రయాణం మొదలు




దాదాపు వంద సంవత్సరాల క్రితం ఫిలియస్ ఫాగ్ అనే వ్యక్తి ఉండేవాడు. అతడు చాలా సంవత్సరాలు ప్రశాంత జీవితం గడిపాడు. అతడు ప్రతి రోజూ క్లబ్బుకి వెళ్లేవాడు. తమ స్నేహితులను కలుసుకోటానికి ధనికులు ఆ క్లబ్బుకి వెళ్లేవాళ్లు.



ప్రతి రోజూ సరిగ్గా ఉదయం **11.30** గంటలకు ఫాగ్ తన ఇంటి నుంచి బయలు దేరేవాడు. **576** అడుగులు వేసి క్లబ్బును చేరుకునేవాడు.

అక్కడే మధ్యాహ్న భోజనం చేసేవాడు.




భోజనం తరవాత మూడు వార్తా పత్రికలను ఫాగ్ శ్రద్ధగా, ఆసాంతం చదివేవాడు. సాయంత్రం అల్పాహారం తరవాత స్నేహితులతో పేక ఆడేవాడు.



పన్నెండు కొట్టగానే ఫాగ్ ఇంటికి వెళ్లి నిద్రపోయేవాడు. మరునాడు మళ్లీ అచ్చం అలాగే చేసేవాడు.

అయితే ఒక బుధవారం అంతా మారిపోయింది. దినపత్రికలో ఫాగ్ ఒక ఆశ్చర్యకరమైన వార్త చదివాడు.

“ఈ వార్త చూడండి,” అతడు మిత్రులతో అన్నాడు. “దీని ప్రకారం కేవలం 80 రోజుల్లో ప్రపంచాన్ని చుట్టి రావచ్చు!”




స్నేహితులు నవ్వినప్పటికీ కష్టమైన ఈ పనిని తాను చెయ్యగలనని ఫాగ్‌కి అనిపించింది.

అది అసాధ్యం అని ఒక స్నేహితుడు పందెం కాసాడు. దానికి, “80 లేదా అంతకంటే తక్కువ రోజుల్లో ప్రపంచాన్ని చుట్టి వస్తానని ఇరవై వేల పౌండ్ల పందెం కాస్తున్నాను!” అన్నాడు ఫాగ్.


అతడికి పిచ్చి పట్టిందని అందరూ అనుకున్నారు. అయినా, ఫాగ్ తన నిర్ణయం మార్చుకోలేదు.

“డిసెంబరు 21 లోపల నేను తిరిగి వస్తాను,” అన్నాడు ఫాగ్.



ఇంటికి చేరుకోగానే సామాను సర్దమని సేవకుడికి చెప్పాడు ఫాగ్.

అతడు అంతకుముందు సర్కస్‌లో పని చేసి ఉండటం వల్ల కావలసిన సామాను వెంటనే సర్దగలిగాడు.




పది నిమిషాలలో తన సేవకుడితో ఫాగ్ రైల్వే స్టేషనులో ఉన్నాడు...

8.45కి రైలు బయలు దేరింది. తన సేవకుడితో ఫాగ్ ప్రపంచం చుట్టి వచ్చే ప్రయాణం కూడా దానితో మొదలయ్యింది.

వాళ్లు సముద్ర తీరానికి వెళుతున్నారు. అక్కడ వాళ్లు ఫ్రాన్స్ వెళ్లటానికి ఓడ పట్టుకోవాలి. అయితే, అక్కడ వాళ్లకి ఏమైనా సమస్యలు కూడా ఎదురు కావచ్చు.



అధ్యాయం 2
ఆఫ్రికా ఖండంలో



ఫాగ్ యూరపు దాటుతున్నప్పుడు పరారీలో ఉన్న ఒక దొంగను పట్టుకునే పనిలో పోలీసులు ఉన్నారు. కొద్ది రోజుల ముందు ఆ దొంగ ఇంగ్లాండు బ్యాంకు నుంచి 55,000 పౌండ్లు దొంగిలించాడు.

దొంగ యూరపు నుంచి ఆఫ్రికా పారిపోటానికి ప్రయత్నిస్తాడని పోలీసు ఇన్‌స్పెక్టర్ ఫిక్స్ భావించాడు. ఆ కారణంగా, సూయెజ్ కాలవ దాటి ఫాగ్ ఉత్తర ఆఫ్రికా చేరుకునే సరికి ఇన్‌స్పెక్టర్ ఫిక్స్ అతడి కోసం అక్కడ కాచుకుని ఉన్నాడు.



తన పాస్‌పోర్ట్ మీద ముద్ర వేయించుకుని రమ్మని ఫాగ్ తన సేవకుడిని పంపించాడు. "ఈ యాత్ర చేసినట్లు నాకు రుజువులు కావాలి," సేవకుడితో అన్నాడు ఫాగ్.


అడగక, అడగక ఇన్‌స్పెక్టర్ ఫిక్స్‌నే పాస్‌పోర్ట్ కార్యాలయానికి దారి అడిగాడు సేవకుడు.

పాస్‌పోర్ట్ చూసిన ఫిక్స్‌కి అనుమానం తీరిపోయింది. పరారీలో ఉన్న దొంగ లాగానే ఫాగ్ ఉన్నాడు. త్వరలోనే దొంగను పట్టుకోవచ్చు అని అతడు అనుకున్నాడు.



అయితే, దానికంటే ముందు అతడు అరెస్టు వారెంటు తెప్పించుకోవాలి.

అందుకే ఫాగ్ ఎక్కడికి వెళుతున్నాడో ఫిక్స్ కనుక్కున్నాడు. తరవాత లండన్‌కి అత్యవసర టెలిగ్రామ్ పంపించాడు: "నేను దొంగను అనుసరిస్తూ భారత దేశం వెళుతున్నాను. అరెస్టు వారెంటును బొంబాయికి పంపించండి."



తరవాత ఇన్‌స్పెక్టర్ ఫిక్స్ తన సామానుతో బొంబాయి వెళ్లే ఓడ ఎక్కాడు.


ప్రయాణంలో చాలా సమస్యలు ఎదురయ్యాయి. కానీ, ఓడ మీద ఫాగ్ చాలా ప్రశాంతంగా ఉన్నాడు. సమయానికి భోజనం చేస్తూ, పేకాట ఆడుతూ అతను కాలక్షేపం చేశాడు. అతడికి తన ఇంటి దగ్గర ఉన్నట్టే ఉంది.

అనుకోకుండా ఓడ రెండు రోజులు ముందుగానే బొంబాయి చేరుకుంది. అతడి అరెస్టు వారెంటు ఇంకా చేరనందున ఫాగ్‌ని ఇన్‌స్పెక్టర్ ఫిక్స్ అరెస్టు చెయ్యలేకపోయాడు.



"ఇక ఒక్కటే ఆశ మిగిలింది," ఫిక్స్ నిర్ణయించుకున్నాడు, "ఫాగ్ భారత దేశం వదిలి వెళ్లకుండా చూడాలి."

భారత దేశంలో ఫాగ్ సేవకుడు ఒక గుడిలోకి వెళ్లాడు. అయితే ముందుగా బూట్లు విప్పాలని అతడికి తెలియదు. బూట్లు విడవమని చెప్పిన పూజారులతో సేవకుడు గొడవకి దిగాడు.



ఇది చూసి ఫిక్స్ చాలా సంతోషించాడు, ‘భారత దేశంలో ఫాగ్ సేవకుడు చట్టాన్ని ఉల్లంఘించటం చూశాను. ఇప్పుడు ఆ సేవకుడిని, అతడి యజమానిని అరెస్టు చెయ్యవచ్చు!’

ఫాగ్‌ని, అతడి సేవకుడిని ఫిక్స్ అనుసరించసాగాడు. వాళ్లిద్దరూ రైలు ఎక్కటం అతను చూశా . ‘సరే, కలకత్తాలో కలుద్దాం,’ ఫిక్స్ తనలో తాను అనుకున్నాడు. ‘ఫాగ్ గారు, మిమ్మల్ని అక్కడ అరెస్టు చేస్తాను.’




3వ అధ్యాయం
ఫాగ్ కాపాడాడు



రైలు ముందుకు కదిలింది. దారిలో అందమైన గుడులు, కాఫీ, పత్తి తోటలు కనిపించాయి. ఈ కొత్త దృశ్యాలను సేవకుడు ఆశ్చర్యంగా చూస్తున్నాడు. రైలులో పేక ఆడటానికి ఫాగ్‌కి ఒక ప్రయాణికుడు దొరికాడు.

అయితే ప్రయాణం మూడవ రోజున రైలు ఉన్నట్టుండి ఆగిపోయింది.


"రైలు పట్టాలు ఇక్కడతో అయిపోయాయి. 50 మైళ్ల దూరాన ఉన్న అలహాబాదులో మళ్లీ పట్టాలు మొదలవుతాయి," ఒక రక్షక భటుడు చెప్పాడు.



రైలు ఆగిపోవటంతో, "సమయానికి కలకత్తా ఎలా చేరుకుంటాం?" అంటూ ఫాగ్ సేవకుడు అరిచాడు.

ఫాగ్ మాత్రం ఏమాత్రం కంగారు పడలేదు. "ఏదో ఒక అవాంతరం ఉంటుందని నేను ప్రణాళిక వేసుకున్నాను," ఫాగ్ శాంతంగా అన్నాడు. "మనం ముందుకు వెళ్లటానికి వేరే సాధనాన్ని పట్టుకోవాలి."

దాని కోసం వెదుకుతూ సేవకుడు వెళ్లాడు. త్వరలోనే అతడు దానితో తిరిగి వచ్చాడు.



ఏనుగు సవారీకి ఖర్చు కొంచెం ఎక్కువే అయ్యింది. కానీ ఫాగ్ అదేమీ పట్టించుకోలేదు. తన పేకాట మిత్రుడిని కూడా రమ్మన్నాడు ఫాగ్.

మావటి ముందు నడుస్తున్నాడు. అరగంటకి వాళ్లు ఒక అడవిగుండా వెళుతున్నారు. ఏనుగు సవారీతో సంతోషంగా ఉన్న సేవకుడు పైకీ, కిందకీ ఊగుతున్నాడు. అతడ మధ్య మధ్యలో ఏనుగుకి చక్కెర ముద్దలు పెడుతున్నాడు.



అలా గంటల పాటు ప్రయాణం చేశారు. ఈత, తాటి తోపులు, ఇసక మైదానాలు దాటుకుంటూ వెళ్లారు. ఆ రాత్రికి ఒక పాడుబడ్డ భవనంలో బస చేశారు.

ఉదయం ఆరు గంటలకు మళ్లీ ప్రయాణం మొదలు పెట్టారు. ఆరటి చెట్లకు ఉన్న కాయలను అల్పాహారంగా తీసుకున్నారు. ఒక దట్టమైన అడవి గుండా వెళుతుండగా సంగీతం, మనుషుల మాటలు వినిపించాయి. ఒక ఊరేగింపు మెల్లగా అటువైపుగా వస్తోంది.



ఆ ఊరేగింపు మధ్యలో ఒక రాకుమారుడి శవాన్ని మోస్తున్న సైనికులు ఉన్నారు. దాని వెనకే ఒక అందమైన స్త్రీని ఇద్దరు వ్యక్తులు లాక్కుంటూ వస్తున్నారు.

సేవకుడు భయపడిపోయాడు. "వీళ్లు ఏం చేస్తున్నారు?" అంటూ అరిచాడు.

"ఇది ఇక్కడి ఆచారం," మావటి చెప్పాడు. "ఎవరైనా రాకుమారుడు చనిపోతే అతడి భార్య కూడా చనిపోవాలి. అప్పుడు, వాళ్లిద్దరూ కలిసి స్వర్గానికి వెళతారు."

"రేపు అతడి తోపాటు రాకుమారిని దహనం చేస్తారు."

సేవకుడికి నోట మాట రాలేదు. మామూలుగా దేనికీ చలించని ఫాగ్ కూడా ఆందోళనకి గురయ్యాడు.

"నాకు పన్నెండు గంటల సమయం ఉంది," ఫాగ్ అన్నాడు. "ఆమెను కాపాడటానికి ప్రయత్నిద్దాం."



రాత్రికి ఊరేగింపు ఒక గుడికి చేరుకుంది. రాకుమారిని లోపల ఉంచి బయట కాపలా ఉన్నారు. ఆమెను కాపాడటానికి ఏ ఉపాయమూ తట్టటం లేదు. అంతలో సేవకుడికి ఒక ఆలోచన వచ్చింది...





మరునాడు ఉదయం రాకుమారిని చనిపోయిన ఆమె భర్త పక్కన చితి మీద ఉంచారు. పూజారులు నిప్పు అంటించారు. అందరూ మాట్లాడకుండా ఇది అంతా చూస్తూ ఉన్నారు. ఉన్నట్టుండి పెద్ద పెద్ద అరుపులు వినిపించసాగాయి. కొంత మంది భయంతో నేల మీద పడుకుండి పోయారు. రాకుమారుడి శవం లేచి కూర్చోవటం కొందరు చూశారు!

పొగ మధ్య నుంచి లేచిన ఒక ఆకారం రాకుమారిని తీసుకుని పరిగెత్తింది. అది ఒక గుర్రాన్ని ఎక్కి అడవి వైపుకి దౌడు తీసింది.



"పదండి తప్పించుకుందాం," అంటూ ఆ ఆకారం అరిచింది. సేవకుడే రాకుమారుడి వేషం వేసుకున్నాడు. తమ వెంట పడుతున్న వాళ్ల బాణాలు తప్పించుకుంటూ ఫాగ్, అతడి స్నేహితుడు సేవకుడిని అనుసరించారు.



4వ అధ్యాయం
మోసం!



అలహాబాదులో ఏనుగును మావటికి అప్పగించి ఫాగ్ వాళ్లు రైలు లోకి ఎక్కారు. గుడిలో జరిగిన గొడవ గురించి ఫిక్స్ ఫిర్యాదు చేయటంతో కలకత్తా చేరుకోగానే ఫాగ్‌ని, సేవకుడిని పోలీసులు అరెస్టు చేశారు.

ఫాగ్, సేవకుడు వారం రోజుల పాటు జైలులో ఉన్నారు. సేవకుడు చాలా ఇబ్బంది పడ్డాడు. జమానతు కింద రెండు వేల పౌండ్లు ఇస్తానని ఫాగ్ చెప్పాడు.

"సరే. నువ్వు తిరిగి రాకపోతే ఆ డబ్బులు జప్తు చేస్తాం," అన్నాడు జడ్జి.



దాంతో ఇంకొక గంటలో బయలు దేరుతుందనగా హాంగ్ కాంగ్ వెళ్లే ఓడలోకి ఫాగ్ వాళ్లు ఎక్కగలిగారు.

ఫిక్స్‌కి చాలా కోపం వచ్చింది. 'హాంగ్ కాంగ్ బ్రిటిష్ రాజ్యం లోదే. ఫాగ్‌ని అక్కడ అరెస్టు చేస్తాను,' అనుకున్నాడు ఫిక్స్.

తన బాబాయ్ కొడుకు కలుస్తాడని రాకుమారి కూడా హాంగ్ కాంగ్ బయలు దేరింది. సింగపూర్‌లో బొగ్గు నింపుకోటానికి ఓడ ఆగినప్పుడు ఫాగ్, రాకుమారి ఒక గుర్రపు బగ్గీలో షికారుకి వెళ్లి వచ్చారు. అనేక రకాల చెట్లు, కోతులు, పులులను వాళ్లు చూశారు.



హాంగ్ కాంగ్ చేరుకోబోతుండగా ఓడ ఒక తుఫానులో చిక్కుకుంది. ఫాగ్ ప్రశాంతంగా ఉన్నాడు. కానీ, సేవకుడు ఆందోళన చెందుతున్నాడు. "మనం హాంగ్ కాంగ్‌లో ఎక్కవలసిన ఓడ వెళ్లిపోతుందేమో," అతను అన్నాడు.


వాళ్లు ఒక రోజు ఆలస్యంగా హాంగ్ కాంగ్ చేరుకున్నారు. వాళ్లు జపాన్‌లోని యోకోహామా వెళ్లటానికి ఎక్కవలసిన ఓడ ఆపాటికి వెళ్లిపోయి ఉంటుందని అనుకున్నా .

"ఇలా జరుగుతుందని నాకు తెలుసు," సేవకుడు అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ ఫిక్స్ సంతోషించాడు. "ఇప్పుడు ఫాగ్‌ని అరెస్టు చెయ్యవచ్చు!" అని అనుకున్నాడు.
కానీ అదృష్టం అతడి వైపు లేదు.

అయితే, యోకోహామా వెళ్లవలసిన ఓడకి కూడా ఆలస్యం అయ్యింది. అంటే ఫాగ్ ఎక్కవలసిన ఓడ ఇంకా రేవులోనే ఉంది. అదీ కాక, ఫాగ్‌ని అరెస్టు చేయటానికి కావలసిన కాగితాలు ఇంకా హాంగ్ కాంగ్‌కి చేరుకోలేదు.

ఆ కాగితాలు వచ్చేవరకు ఫాగ్‌ని హాంగ్ కాంగ్‌లో ఉంచాలని ఫిక్స్ ప్రయత్నిస్తున్నాడు.



ఆ రాత్రికి ఫాగ్ ఒక హోటల్ తీసుకున్నాడు. తరవాత, రాజకుమారి వాళ్ల బాబాయ్ కొడుకుని వెదుకుతూ వెళ్లారు. ఓడలో మూడవ బెర్త్ తీసుకోమని తన సేవకుడిని ఫాగ్ పంపించాడు.

రేవుకి వెళ్లినప్పుడు ఓడ అదే రోజు సాయంత్రం బయలు దేరుతోందని సేవకుడికి తెలిసింది. ఫిక్స్‌కి కూడా ఆ విషయం తెలిసింది.




"మా యజమాని ఎక్కడ ఉన్నాడో వెదికి పట్టుకోవాలి!" సేవకుడు ఏడుస్తూ చెప్పాడు. అయితే, ముందుగా ఒక చుక్క మద్యం కోసమని అతడిని ఫిక్స్ పిలిచాడు.

"నేను ఒక అపరాధ పరిశోధకుడిని, మీ యజమాని ఒక దొంగ!" మద్యశాలలో సేవకుడితో ఫిక్స్ చెప్పాడు.


"అబద్ధం!" సేవకుడు అరిచాడు.

'ఓడ ఈ రోజు సాయంత్రమే బయలు దేరుతోందన్న సంగతి ఫాగ్‌కి తెలియకూడదు,' అనుకున్నాడు ఫిక్స్. అందుకని అతడు సేవకుడితో బాగా మద్యం తాగించాడు.

కొంచెం సేపటికి సేవకుడు నిద్ర మత్తులో తూగసాగాడు. ఇన్‌స్పెక్టర్ ఫిక్స్ మెల్లగా అక్కడి నుంచి బయటపడ్డాడు.




మరునాడు ఫాగ్ ఓడ రేవుకి వెళ్లాడు. రాజకుమారి బాబాయ్ కొడుకు హాంగ్ కాంగ్‌లో ఇప్పుడు లేడని తెలియటంతో ఆమె కూడా అతని తోపాటు వచ్చింది. అయితే ఫాగ్ ఎక్కవలసిన ఓడ నిన్న సాయంత్రమే వెళ్లిపోయింది. ఫాగ్ సేవకుడి జాడ కూడా తెలియలేదు.



జపాన్ వెళ్లటానికి వారం రోజుల తరవాత గానీ మరొక ఓడ లేదు. అయితే, ఫాగ్ ధైర్యం కోల్పో లేదు. అతడు వేరే దారులను వెదుకుతున్నాడు.

చివరికి ఫాగ్‌కి ఒక చిన్న ఓడ కెప్టెన్ కలిశాడు. వాళ్లని షాంఘై వరకు తీసుకుని వెళ్లటానికి సిద్ధమయ్యాడు. "అక్కడి నుంచి మీరు యోకోహామాకి మరొక స్టీమరు తీసుకోవచ్చు," అతను చెప్పాడు. రేవులో ఫిక్స్ కలిస్తే అతడిని కూడా తమతో రమ్మని ఫాగ్ పిలిచాడు.

ఓడ బయలు దేరటానికి ముందు పట్టణం అంతా ఎంత గాలించినా సేవకుడి జాడ తెలియలేదు.



రెండు రోజుల పాటు ఆ చిన్న ఓడ సముద్రంలో వేగంగా దూసుకుని వెళ్లింది. అప్పుడు ఒక తుఫాను చెలరేగింది. ఒక పెద్ద అల ఓడను తాకింది. దాంతో సముద్రంలో ఆ ఓడ అటూ, ఇటూ కొట్టుకుని పోసాగింది.



తుఫాను శాంతించే సరికే చాలా సమయం వృధా అయ్యింది. తెరచాపలు అన్నీ ఎత్తినప్పటికీ ఓడ అంత వేగంగా వెళ్లటం లేదు.

ఆ సమయంలో వాళ్లకి ఒక స్టీమరు కనిపించింది.

“ఈ స్టీమరు షాంఘై నుంచి యోకోహామా వెళు   ంది,” కెప్టెన్ చెప్పాడు.

“ఆ స్టీమరుకి సంకేతం పంపించండి,” ఫాగ్ అన్నాడు.



పెద్ద శబ్దంతో ఒక రాకెట్టుని పేల్చారు. స్టీమరుని ఓడ చేరుకోగానే ఫాగ్, రాజకుమారి, ఫిక్స్ అందులోకి ఎక్కారు.

మరి ఫాగ్ సేవకుడి పరిస్థితి ఏమిటి?

జపాన్ వెళ్లే ఓడ బయలు దేరే సమయానికి అతడు అక్కడికి చేరుకున్నాడు. పరిగెత్తుకుంటూ వెళ్లి అందులోకి ఎక్కాడు. ఫాగ్ ఆ ఓడలో లేకపోవటంతో అతడు ఎంతో బాధపడ్డాడు.



దాంతో యోకోహామా చేరుకున్న తరవాత ఏం చెయ్యాలో అతడికి పాలుపోలేదు. దిక్కు తోచక అటూ ఇటూ తిరుగుతున్న అతడికి ఒక పోస్టర్ కనిపించింది.



"ఈ ప్రదర్శనలో చేరగలిగితే బాగుంటుంది. వాళ్లు తరవాత అమెరికాకి వెళుతున్నారు. ఫాగ్ కూడా అక్కడికే చేరుకోవాలి," అని సేవకుడు అనుకున్నాడు.

“తల మీద నిలబడి, కుడి కాలు మీద కత్తి పెట్టుకుని, ఎడమ కాలి మీద బొంగరం తిప్పుతూ పాట పాడగలవా?” సర్కస్ యజమాని అడిగాడు.


చెయ్యగలనన్నట్టు సేవకుడు తల ఊపాడు. “అయితే, ఈ రోజే నిన్ను చేర్చుకుంటున్నాం.”



ఆ రోజు సాయంత్రం అతడు మొదటి ప్రదర్శనలో పాల్గొన్నాడు. ఒకరి మీద ఒకరు మనుషులు త్రికోణాకారంగా ఏర్పడ్డారు. కింద వరసలో సేవకుడు ఉన్నాడు. ఆ ప్రదర్శన ప్రేక్షకులకు ఎంతో నచ్చింది. అయితే, ఉన్నట్టుండి...




...వాళ్లందరూ కింద పడిపోయారు.



ఆ సమయంలో సేవకుడికి తన యజమాని కనిపించాడు. దాంతో అతడు పరిగెత్తుకుంటూ అతడి దగ్గరకి వెళ్లాడు.



5వ అధ్యాయం
ఇంటి వైపుకి



ఒకరి గురించి ఒకరు తెలుసుకోటానికి వాళ్ల దగ్గర ఇప్పుడు సమయం లేదు. వాళ్లు పరిగెత్తుకుంటూ వెళ్లి శాన్ ఫ్రాన్సిస్కో వెళుతున్న ఓడను ఎక్కారు. ఆమెకు వేరే ఎవ్వరూ లేకపోవటంతో రాజకుమారి కూడా వాళ్లతో బయలు దేరింది. రోజు, రోజుకీ ఆమెకు ఫాగ్ పట్ల ప్రేమ పెరగసాగింది.

ఓడ ముందుకు సాగుతుంటే పందెంలో ఫాగ్ గెలుస్తాడన్న నమ్మకం సేవకుడిలో పెరగసాగింది. అయితే, ఒక రోజు ఓడ డెక్కు మీద అతడికి ఇన్‌స్పెక్టర్ ఫిక్స్ కలిశాడు. అతడు రహస్యంగా వాళ్లనే అనుసరిస్తూ ఉన్నాడు.



ఫిక్స్‌ని సేవకుడు కొట్టాడు.

"ఒకప్పుడు మీకు వ్యతిరేకంగా పని చేశాను..." ఫిక్స్ ఒప్పుకున్నాడు.

"అవును..." అంటూ సేవకుడు అరిచాడు.

"నీ యజమాని దొంగ అని నాకు ఇప్పటికీ అనుమానంగా ఉంది. అయితే, ఎలాగైనా అతడు ఇంగ్లాండ్ వెళ్లేలా చెయ్యాలి. అక్కడ మాత్రమే అతడిని అరెస్టు చెయ్యగలను," ఫిక్స్ చెప్పాడు.

యజమానిని ఇబ్బంది పెట్టటం ఇష్టంలేక అతడికి ఫిక్స్ గురించి సేవకుడు ఏమీ చెప్పలేదు. అయితే, శాన్ ఫ్రాన్సిస్కోలో ఫాగ్ తన పాస్‌పోర్టు మీద ముద్ర వేయించుకునేటప్పుడు అతడికి ఫిక్స్ కనిపించాడు.

"ఎంత ఆశ్చర్యం!" ఫిక్స్ అబద్ధం ఆడాడు. అమెరికా తూర్పు తీరాన్ని చేరటానికి రైలులోకి ఫాగ్ వాళ్లతో ఫిక్ కూడా ఎక్కాడు.



పసిఫిక్ రైల్‌రోడ్డు అమెరికా ఖండాన్ని చీల్చుకుంటూ న్యూయార్క్ వైపుకి వెళుతోంది. అందులో హోటళ్లు, దుకాణాలు వంటి అన్ని సౌకర్యాలు ఉన్నాయి. అయితే, అడవి దున్నలు పట్టాలను దాటుతున్నప్పుడు రైలు ఆగవలసి వచ్చేది.


దారిలో, ఒక బలహీనమైన వంతెన అవరోధంగా ఉంది. "పూర్తి వేగంతో దీనిని దాటతాను!" రైలు డ్రైవరు అన్నాడు. అతడు నడిపిన వేగానికి రైలు చక్రాలు పట్టాలను తాకటం లేదమో అనిపించింది.

రైలు వంతెన దాటి రెండోవైపుకి చేరుకుందో లేదో వంతెన కాస్తా నదిలోకి కూలిపోయింది.



ఆ వెంటనే మరో కష్టం వచ్చి పడింది. కొండల మధ్య నుంచి రైలు వెళుతున్నప్పుడు ఒక తెగ సైనికులు రైలు మీదకి దూకారు. త్వరలోనే వాళ్లు రైలుని తమ అదుపులోకి తీసుకున్నారు.





అతడు రైలు కింద నుంచి ఎవరి కంటా పడకుండా ముందుకి వెళ్లాడు. ఇంజిను దగ్గరకు చేరుకున్న తరవాత దానిని రైలు నుంచి వేరు చేశాడు. దాంతో, రైలు మెల్లగా ఆ స్టేషను దగ్గర ఆగింది.

అలా అంటూ సేవకుడు రంగంలోకి దిగాడు.



కొంత సేపు తరవాత చూస్తే ఫాగ్‌కి తన సేవకుడు కనపడలేదు.

"మీ సేవకుడిని సైనికులు బందీగా చేసి తీసుకుని వెళ్లారు!" రైలు గార్డు చెప్పాడు.

దాంతో కొంతమంది సైనికులను తీసుకుని సేవకుడిని వెదుకుతూ ఫాగ్ బయలు దేరాడు.



అతడు ఎక్కడ ఉన్నాడో తెలుసుకుని, విడిపించటానికి ఫాగ్‌కి ఆ రోజంతా పట్టింది. దాంతో ఆ రాత్రి వాళ్లు అక్కడే బస చేయవలసి వచ్చింది. మరునాడు ఉదయానికి గాని వాళ్లు స్టేషనుకి చేరుకోలేదు.

అప్పటికి ఆ రైలు వెళ్లిపోయింది. మళ్లీ సాయంత్రమే మరొక రైలు ఉంది.

"నా వల్ల మళ్లీ పొరపాటు జరిగింది," సేవకుడు ఏడుస్తూ అన్నాడు. అయితే వాళ్లకి ఫిక్స్ సహాయపడ్డా . "మంచు పడవ యజమాని ఒకరిని ఇప్పుడే కలిశాను," అతడు చెప్పాడు.

మంచు పడవకి ఉన్న తెరచాపల వల్ల అది వేగంగా వెళుతోంది. మంచు మైదానాలను అది తేలికగా దాటేసింది.



దాంతో, రెండవ స్టేషను లోనే వాళ్లు రైలుని మళ్లీ అందుకోగలిగారు. రైలు న్యూ యార్క్ వైపుకి వేగంగా దూసుకుని వెళుతోంది. ఫాగ్‌కి ఇప్పటికీ పందెం గెలిచే అవకాశం ఉంది.

చివరికి వాళ్లు హడ్సన్ నది పక్కన న్యూ యార్క్ స్టేషను చేరుకున్నారు. అయితే, నలభై అయిదు నిమిషాల ముందే ఇంగ్లాండుకి వెళ్లే ఓడ వెళ్లిపోయింది.



మరే స్టీమరు అతడిని సమయానికి అట్లాంటిక్ మహా సముద్రాన్ని దాటించలేదు. సేవకుడు నిరుత్సాహ పడిపోయాడు. అయితే, రేవులోని ప్రతి ఓడ దగ్గరకి ఫాగ్ వెళ్లాడు. చివరికి ఒక ఓడ యజమాని వాళ్లని తీసుకుని వెళ్లటానికి సిద్ధమయ్యాడు.

అయితే, ఆ ఓడ ఫ్రాన్స్‌కి వెళుతోంది. ఫాగ్ కంగారు పడలేదు. ఓడ కెప్టెన్‌ని అతడి గదిలో బంధించి ఓడని దారి మళ్లించాడు.

ఓడ వేగంగా వెళుతోంది. అయితే, చలి కాలం కావటం వల్ల వాతావరణం సరిగా లేదు. ఇది చాలదన్నట్టు బాయిలర్ లోకి కావలసినంత బొగ్గు లేదన్న వార్తని ఇంజినీరు తీసుకుని వచ్చాడు.




'మా యజమాని ఎంత తెలివైన వాడైనా ఈ సమస్యని పరిష్కరించలేడు,' అనుకున్నాడు సేవకుడు.


కానీ, ఈసారి కూడా అతడిని ఫాగ్ ఆశ్చర్య పరిచాడు.
తెరచాప కొయ్యలను ముక్కలుగా చేసి వాటిని
ఇంధనంగా వాడమని నావికులకు ఫాగ్ చెప్పాడు.



తరవాత ఓడలోని చెక్క భాగాలను ఒకటొకటిగా
ఉపయోగించటం మొదలు పెట్టారు...



క్యాబిన్...





డెక్కు కూడా...

చివరికి ఓడ ఇంగ్లాండు చేరుకునేసరికి దాంట్లో చెక్క
భాగం అన్నది ఏదీ మిగల లేదు.

వాళ్లు లివర్‌పూల్‌లో ఓడ దిగేసరికి, రైలు పట్టుకుని లండన్ చేరుకుని పందెం గెలిచేటంత సమయం మాత్రమే ఉంది. అయితే, అదే సమయంలో ఇన్‌స్పెక్టర్ ఫిక్స్ రంగంలోకి దిగాడు.

"ఫిలియస్ ఫాగ్, 55,000,పౌండ్లు దొంగతనం చేసినందుకు మిమ్మల్ని అరెస్టు చేస్తున్నాను," అన్నాడు.

ఫాగ్‌ని జైలులో వేశారు. ఏం చెయ్యాలో రాజకుమారికి, సేవకుడికి తెలియటం లేదు.


మూడు గంటలు గడిచిన తరవాత ఫిక్స్ పరిగెత్తుకుంటూ వచ్చాడు. అతడి జుత్తు చిందరవందరగా ఉంది. అతడు చాలా పశ్చాత్తాప పడుతున్నాడు. "నా వల్ల పెద్ద పొరపాటు జరిగిపోయింది," అతడు ఏడుస్తూ చెప్పాడు.





జైలు నుంచి ఫాగ్ విడుదల అయ్యాడు. అయితే, వాళ్లు లండన్ చేరుకోటానికి అయిదున్నర గంటల సమయం మాత్రమే ఉంది.

ఒక ప్రత్యేక రైలులో ఫాగ్ లండన్ బయలు దేరాడు. రైలు లండన్ స్టేషను చేరుకునేసరికి 8 గంటల 55 నిమిషాలు అయ్యింది. ఫాగ్ తన పందాన్ని పది నిమిషాల తేడాతో ఓడిపోయాడు.





6వ అధ్యాయం
తరవాత ఏమిటి?



ఫాగ్ మనసులో ఏం జరుగుతోందో అతడి ముఖాన్ని బట్టి తెలియటం లేదు. రాజకుమారి, సేవకుడుతో కలిసి అతడు ఇంటికి వెళ్లాడు. మరునాడు అంతా అతడు తన గదిలోనే ఉండిపోయాడు. మొత్తం అయిన ఖర్చులను లెక్క వేస్తున్నాడు.

సాయంత్రం ఏడు గంటలకు రాజకుమారిని ఆమె గదిలో ఫాగ్ కలిశాడు.

“మిమ్మల్ని ఇంగ్లాండు తీసుకుని వచ్చినప్పుడు నాకు చాలా ఆస్తి ఉంటుందని అనుకున్నాను. కానీ, అలా జరగలేదు,” రాజకుమారితో ఫాగ్ చెప్పాడు.

“నాకు మీ డబ్బు అక్కర లేదు. మీరు చాలు,” రాజకుమారి మృదువుగా బదులు ఇచ్చింది.




అది విన్న ఫాగ్ ఎంతో సంతోషించాడు. అతడి మనసులోని భావన మొదటిసారి అతడి ముఖంలో ప్రకటితం అయ్యింది. అతడు సేవకుడిని పిలిచి, “వెంటనే చర్చికి వెళ్లి రేపు మా పెళ్లికి ఏర్పాట్లు చేయించు.”



అక్కడ క్లబ్బులో ఫాగ్ స్నేహితులు గత కొద్ది రోజుల నుంచి ఎంతో ఉద్వేగంతో ఉన్నారు. అక్టోబరు 2న ఫాగ్ వెళ్లిన తరవాత అతడికి సంబంధించిన సమాచారం ఏమీ వాళ్లకి అంద లేదు.

డిసెంబరు 21 సాయంత్రం నుంచి అతడు వస్తాడేమోనని అతడి స్నేహితులు ఎదురు చూస్తున్నారు. గడియారంలో **8.44** అయినప్పుడు తలుపు కొట్టిన శబ్దం అయ్యింది.



ఫిలియస్ ఫాగ్ చెప్పిన సమయానికి తిరిగి వచ్చాడు. అది ఎలా సాధ్యం అయ్యింది? చర్చి నుంచి సేవకుడు నమ్మలేని వార్తతో తిరిగి వచ్చాడు.

"రేపు సోమవారం కాదు," సేవకుడు సంతోషంగా చెప్పాడు. "రేపు ఆదివారం. ఈ రోజు శనివారం!"



ఫాగ్ తూర్పుకి ప్రయాణించటం వల్ల అతడికి ఒక రోజు కలిసి వచ్చింది. క్లబ్బుకి చేరుకుని పందెం గెలవటానికి అతడికి ఇంకా పది నిమిషాల సమయం ఉంది.

ఫాగ్ 20,000 పౌండ్ల పందెం గెలిచాడు. అయితే, ప్రపంచాన్ని చుట్టి రావటానికి అతడికి 19,000 పౌండ్లు ఖర్చు అయ్యాయి. కాబట్టి డబ్బు పరంగా అతడికి పెద్ద లాభం చేకూర లేదు.

కానీ, ఆ ప్రయాణంలో అతడికి భార్య దొరికింది, సంతోషం దొరికింది. ఇవి దొరుకుతాయంటే ఎవరైనా లోకం చుట్టి రావటానికి సిద్ధంగా ఉంటారు.





ఫ్రెంచ్ రచయిత అయిన జూల్స్ వెర్న్ (1828-1905)కి విజ్ఞాన శాస్త్రం అన్నా, ప్రయాణాలు అన్నా చాలా ఇష్టం. అతడు తన మొదట నవలని 1863లో రాశాడు. Around the Word in Eighty Days అన్న ఈ పుస్తకాన్ని 1873లో రాశాడు.



జూల్స్ వెర్న్ అనేక కాల్పనిక విజ్ఞాన నవలలు రాశాడు. వాటిల్లో Journey to the Centre of the Earth, 20,000 Leagues Under the Sea చెప్పుకోదగినవి. అప్పుడూ, ఇప్పుడూ ఇవి పెద్దలను, పిల్లలను ఎంతగానో అలరిస్తున్నాయి.